నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం | మార్చి 20, 2024 | www.navatelangana.com

## మైలారం సొసైటీ చైర్మన్ పదవికి రాజీనామా

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండలం మైలారం సహకార సంఘం చైర్మన్ పెర్క శ్రీనివాస్ తన సొసైటీ చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎన్, శ్రీనివాస్ రావు తెలిపారు. గత కొన్ని రోజులుగా మండలంలో పలు సహకార సంఘాల పై కొంతమంది సహకార సంఘ అధ్యక్షులపై అవిశ్వాసం తీర్మానాలు పెట్టడంతో, తానే ముందుచూపుగా మైలారం సహకార సంఘం అధ్యక్ష పదవికి రాజీనామా చేశారని నాయకులు తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గంలో గత కొన్ని నెలలుగా వివిధ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో మండలంలో రాజకీయ సమీకరణాలు రోజురోజుకు మారుతున్నాయి ఈ నేపథ్యంలో అవిశ్వాసం కంటే రాజీనామా చేయడమే ఉత్తమం అంటూ ముందస్తుగా సొసైటీ పదవికి రాజీనామా చేసి ప్రజలకు సేవలు అందిస్తారని పెర్క శ్రీనివాస్ వర్గీయులు తెలిపారు.

## నీటిసమస్య తీర్చేందుకు బోర్ పనులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలం కొడిచర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయం స్థానిక ప్రజలు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు దృష్టికి తీసుకురాగా అయన వెంటనే స్పందించి బోర్ వేయాలని ఆదేశించారు. మంచి నీటి సమస్య తీర్చినందుకు కోడిచర గ్రామ తాజా మాజీ సర్పంచ్ సంతోష్ పటేల్ గ్రామస్తుల తరవున ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు రమేష్ వట్నాల్ వార్ , గ్రామ నాయకులు నాగనాథ్ , బస్వంత్, నర్సింగ్, సురేష్, శ్రీనివాస్, తధితరులు నాయకులు పాల్గొన్నారు.



బోర్ డ్రిల్లింగ్ పనులు ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు





జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టిన రైతులు.. మాట్లాడుతున్న ఆర్డీవో

# పంటనష్ట పరిహారం చెల్లించండి

- 44వ జాతీయ రహదారిపై రైతన్నల ధర్నా
- సర్వస్వం కోల్పోయామని ఆవేదన
- రెండు గంటలకు పైగా ధర్నా, నిలిచిన వాహనాలు

నవతెలంగాణ-భిక్కనూర్

పంట చేతికి వచ్చిన తరుణంలో కురిసిన అకాల వర్షంతో పూర్తిగా నష్టపోయామని, అధికారులు ప్రభుత్వం స్పందించి పంట నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరారు. పంటలను చూసి కన్నీటి పెట్టుకుంటున్న రైతులను ప్రజాప్రతినిధులు వచ్చి పరిశీలించి ఓదార్చి వెళ్ళారే తప్పా.. పంట నష్ట పరిహారం ఎప్పుడు ఇస్తారో తెలియజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లోని జాతీయ రహదారి 44పై మంగళవారం రైతులు రాస్తారోకో చేపట్టారు. వడగళ్ల వానతో మండలంలోని ఆరు గ్రామాల్లో అన్ని పంటలకు 100 శాతం నష్టం ఏర్పడినట్టు వాపోయారు. ప్రజాప్రతినిధులు వచ్చి చూసి వెళ్లారే తప్పా.. పరిహారం ఎప్పుడు చెల్లిస్తారో తెలపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల అధికారులకు వినతి పత్రం సమర్పించినా ఎలాంటి స్పందనా లేదని అన్నారు. పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకొని ఎకరానికి 50వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వ్యవసా య అధికారులు వచ్చి తమ సమస్య పరిష్కరించే వరకు ధర్నా విరమించబోమని భీష్మించి కూర్చున్నారు. రెండు గంటలకు పైగా ధర్నా చేపట్టడంతో జాతీయ రహదారిపై ఇరు వైపులా వాహనాలు కిలోమీటర్‌ల మేర బారులు తీరాయి.





తీవ్రంగా నష్టపోయామంటూ మొక్కజొన్న పంటను చూపుతున్న రైతులు.. నిరసనలో మహిళా రైతుల నినాదాలు

# కుస్‌కుస్ కుంచే
# గ్రామ పంచాయతీని ముంచే

- అప్ సెట్ ధర రాకుండా మళ్లీ అడ్డుకట్ట
- సంబరాల్లో సడేమియాలు
- మూడోసారి నవీపేట్ సంతల వేలం వాయిదా
- ఫైనల్ చేయాలంటూ అధికారులపైనే బలవంతం
- జీపీకి తగ్గనున్న 25 లక్షల ఆదాయం

నవతెలంగాణ-నవీపేట్

రాష్ట్రంలోనే నవీపేట్ మేకల సంత పేరుగాంచింది. ఇక్కడి నుంచి జీవాలు కొనుగోలు చేసి హైదరాబాద్, వైజాగ్ సహా.. ఇతర చుట్టు పక్కల ప్రాంతాలకు తరలిస్తుంటారు. అంతటి ప్రాధాన్యమున్న సంతకు వేలం వేస్తే లక్షల్లో ఆదాయం రావాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా గతేడాది కంటే తక్కువ ధర వస్తుండటం గమనార్హం. అప్‌సెట్ ధర రాకపోవడంతో మంగళవారం మూడో సారి వేలం నిర్వహించినా అదే తంతు. సంతల వేలంలో సడేమీయాలు పాల్గొంటూ దశాబ్ద కాలంగా మేకల సంతపై రాజ్యం చేస్తున్న కాంట్రాక్టర్ కుస్ కుస్ కుంచె (చెవులు కొరకడం) లకు లక్షల్లో ఆదాయం అప్పనంగా అప్పజెబుతూ గ్రామ పంచాయతీని నిండా ముంచుతున్నారు. కోటికి పైగా ఆదాయం ఉన్న సంతల వేలానికి అధికార యంత్రాంగం జిల్లాలో సరైన ప్రచారం కల్పించకపోవడంతో స్థానికులైన సడేమియాలు వేలంలో పాల్గొని బడేమియాలకు బలం చేకూరుస్తున్నారు.

**ముచ్చటగా మూడోసారి వాయిదా**

గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో నాగనాథ్, ఎంపీఓ రామకృష్ణ, కార్యదర్శి రవీందర్ నాయక్ ల సమక్షంలో ముచ్చటగా మూడోసారి మేకల వారాంతపు సంతలకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. మేకల సంత వేలం పాటకు ఏకంగా 123 మంది పాల్గొనగా సిరాజుద్దీన్ 4,51,000కి చివరి పాట పాడారు. వారాంతపు సంతలో 57 మంది పాల్గొనగా 5 లక్షల 19 వేలకు మజరుద్దీన్ చివరి పాట పాడారు. రెండు సంతలకు అప్సెట్ ప్రైస్ రాకపోవడంతో అధికారులు ఉన్నతాధికారులకు వేలంపాట నివేదికను పంపి నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రకటించారు. మేకల సంతలో వేలంలో 123 మంది వేలంపాట దారులు పాల్గొని గత వేలానికి కేవలం రూ.16 వేలే పెంచడం గమనార్హం. అలాగే వారాంతపు సంతలో కూడా 57 మంది పాల్గొని కేవలం 48000 మాత్రమే పెంచడం సిండికేట్ కు నిదర్శనంగా మారింది.

**అధికారులపైనే బలవంతం**

గతేడాది మేకల సంత వేలం రూ.55 లక్షల 16 వేలు పలికింది. ఈసారి మూడుసార్లు వేలం నిర్వహించినా అప్‌సెట్ ధర రాలేదు. వేలం పాటను పారదర్శకంగా నిర్వహించాలని నిబంధన ఉన్నా ఉల్లంఘిస్తూ అధికారులు, పోలీసుల సమక్షంలోనే అధికారికంగా వీడియో తీస్తున్నా పట్టించుకోకుండా వేలంపాటను అపహాస్యం చేస్తున్నట్లు కొంతమంది ప్రయత్నం చేసినా అధికార యంత్రాంగం మాత్రం ప్రేక్షక పాత్రనే పోషించింది. వేలం పాటను పాడడం, కాదనడం.. వేలంపాట హాలులో లేకుండా బయట కిటికీలో నుండి వేలం పాటను పాడుతూ సఫాయి సిబ్బంది, ప్రజల మౌలిక సౌకర్యాలకు ఆదాయం చేకూర్చే వేలంపాటను అపహాస్యం చేస్తూ ఆశ్చర్యపరిచారు.



గుడ్‌విల్ కోసం గుసగుస.. కార్యాలయం ఎదుట వేచిచూస్తున్న పాటదారులు

**వేలానికి ఏకంగా 123 మంది హాజరు..**

మేకల సంత వేలానికి హాజరై ధర పెంచకుండా ఉంచితే పాల్గొన్న వారికి పదివేల రూపాయల గుడ్‌విల్ ఇస్తున్నట్టు ప్రచారం జరగడంతో మంగళవారం ఏకంగా 123 మంది పాటదారులు వచ్చారు. పెద్ద సంఖ్యలో వేలంపాటదారులు హాజరు కావడంతో స్థాయిని బట్టి సడేమియాలకు రేటు ఫిక్స్ చేశారు. బాధ్యత భుజాన ఎత్తుకొని మూడోసారి అప్‌సెట్ ధర రాకుండా సక్సెస్ చేశారు. కానీ జిల్లా అధికారులదే అంతిమ నిర్ణయం అనడం, రెండు మూడు రోజుల తర్వాతే నిర్ణయం తీసుకుంటామని అధికారులు చెప్పడంతో గుడ్‌విల్ కోసం వచ్చిన పాటదారులు ఖంగుతిన్నారు. సదరు వ్యక్తి సైతం పనిమిద వెళ్తున్న వెళ్లిపోయే సరికి వేలానికి వచ్చిన పాటదారులు రిసిప్టులు చేత పట్టుకొని పిచ్చి పుల్లయ్యలుగా గుడ్‌విల్ కోసం పరేషాన్ అయ్యారు.



వేలంలో అధికారుల ముందే పాటదారుల కుస్‌కుస్ కుంచె(చెవులు కొరుక్కోవడం)

**లక్షల్లో తగ్గనున్న ఆదాయం!**

గతంలో మేకల, వారంతపు సంత సులబ్ కాంప్లెక్స్ ల ఆదాయం 70 లక్షలకు పైగా వచ్చినా గత మూడు నెలలుగా సఫాయి సిబ్బందికి వేతనాలు లేక గ్రామంలో కనీసం దోమల బెడద నుండి రక్షించడానికి ఆదాయం కరువైంది. అటువంటిది గతంలో కంటే సుమారు 24 లక్షల ఆదాయం తగ్గనుండడంతో ప్రజల భవిష్యత్తుతో పాటు సఫాయి కార్మికుల జీతాలు ప్రశ్నార్థకంగా మారనున్నాయి. సంత వేలంపై పెద్దఎత్తున ప్రచారం కల్పిస్తే ఎక్కువ మంది ఆశవాహులు వస్తే ధర పెరిగే అవకాశం ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

**అధికారులదే అంతిమ నిర్ణయం**

వేలంలో అప్ సెట్ ప్రైస్ రాకుండా బడేమియాలు సడేమీయాలతో కలిసి మూడుసార్లు వాయిదాల పర్వం కొనసాగించి సఫలం అవడంతో సంబరాలు చేసుకున్నారు. చివరికి మండల అధికారులు నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని వారి నిర్ణయమే అంతిమ నిర్ణయంగా ప్రకటించారు. దీంతో సడేమీయాలు కొంత అప్సెట్ అవ్వడంతో బలవంతం చేసిన నిబంధనలు పాటించాల్సిందేనని ఖరాఖండిగా తేల్చి చెప్పారు. దీంతో జిల్లా అధికారులు జిల్లాలోని సంతల కాంట్రాక్టులకు విస్తృతంగా సమాచారం ఇచ్చి చర్చలు జరిపి పది రోజుల వ్యవధిలో గ్రామ పంచాయతీ ఆదాయాన్ని పెంచేలా ప్రత్యేక చొరవ చూపి సిండికేటుగాళ్లకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. గత సర్పంచ్‌గా ఏటీఎస్ శ్రీనివాస్ ఉన్నప్పుడు వేలం పాటను పారదర్శకంగా నిక్కచ్చిగా వ్యవహరించడంతో

## కంపెనీల నుంచి కెమికల్ వాసనలు

- భరించలేకపోతున్నామంటూ స్థానికుల ఆవేదన

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణ సమీపంలో ఉన్న ఓ కెమికల్ కంపెనీ నుండి వస్తున్న వాసన భరించలేకపోతున్నామని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలల నుండి సాయంత్రం, రాత్రి, తెల్లవారుజామున కంపెనీ నుండి వచ్చే వాసన భరించలేక అనారోగ్యం పాలవుతున్నామని చీకటి పడక ముందే ఇంటి తలుపులు మూసి ఉంచి ఉండాల్సి వస్తుందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు కెమికల్ కంపెనీ నుండి వచ్చే వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాసన భరించలేక తలుపులు మూసి ఉండాల్సి వస్తుందని ప్రజలు తెలిపారు. ఈ మధ్యకాలంలో కంపెనీ సమీపంలోని వ్యవసాయదారులకు రాత్రి సమయంలో కంపెనీ నుండి వచ్చే కెమికల్ వాసన భరించలేక కంపెనీ యాజమాన్యంతో గొడవకు దిగారు. గతంలో కంపెనీ సమీపంలోనే వచ్చే కెమికల్ వాసన ప్రస్తుతం అంతంపల్లి, లక్ష్మీదేవిపల్లి, పెద్ద మల్లారెడ్డి, మల్లు పల్లి, కంచర్ల, భిక్కనూర్, బస్వాపూర్ గ్రామాలకు వ్యాపించి ఊపిరాడకుండా చేస్తుందని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలు దృష్టిలో ఉంచుకొని కెమికల్ వాసన వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుచున్నారు.

# సమన్వయంతో పనిచేయాలి

- అధికారులు, బృందాలు, సిబ్బంది కలిసి సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాలి
- జూమ్ మీటింగ్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో పార్లమెంటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు నియమించిన అధికారులు, బృందాలు, సిబ్బంది సమన్వయంతో పనిచేయలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ లు కోరారు. మంగళవారం ఆర్.డి.ఓ.లు, డి.ఎస్పీలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన జూమ్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రవర్తనా నియమావళి అమలుపై వర్క్ షాప్ ఏర్పాటు చేసి అవగాహన కలిగించాలన్నారు. ఎన్నికల ఉల్లంఘనకు పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితిలో ఉల్లంగించదవద్దని అన్నారు.

పోలింగ్ మే 13 న పూర్తి ఎండాకాలంలో వస్తున్నందున ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీడ సౌకర్యం ఏర్పాటు చేయాలని, పోలింగ్ బూత్‌లలో సరైన వెలుతురు , మంచినీరు, టాయిలెట్స్, ర్యాంప్, వీల్ చైర్ తప్పనిసరిగా ఉండేలా చూడాలని అన్నారు. తహసీల్దార్ లు ముందస్తుగా ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి మౌలిక వసతులతో పాటు వల్నరబిలిటీ మ్యాపింగ్ చూడాలన్నారు. ఏప్రిల్ 25 వరకు ఓటర్ల నమోదుకు అవకాశముందని, అప్పటి వరకు వచ్చిన అన్ని ఫారాలను పరిష్కరించాలని, ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలని తహసీల్దార్లకు సూచించారు. సభలు, సమావేశాలు, వాహనాలు, ఎల్.ఈ.డి. స్క్రీన్ ల ద్వారా ప్రచారానికి, కరపత్రాల ముద్రణకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని అన్నారు. అక్రమంగా తరలుతున్న డబ్బు, మద్యం, కానుకలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేయాలని సూచించారు. సి విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే ఫ్లైయింగ్ స్క్వాడ్ ను అప్రమత్తం చేయాలని, ఆ బృందం కూడా వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. షెడ్యూల్ వెలువడి 72 గంటలు దాటినందున ఎక్కడ రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్స్, ఫ్లెక్సీలు, హోర్డింగ్ లు, ఫోటోలు లేకుండా చూడాల న్నారు. 85 సంవత్సరాలు పై బడిన వృద్ధులు, వికలాంగు లకు ఇంటి వద్ద నుండే ఓటు వేసే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందని, ఓటు వినియోగం కోసం ఫారం - 12 ద్వారా అవకాశం కల్పించాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న ఓటరు ఎపిక్ కార్డులను వెంటనే పంపిణి చేయవలసినదిగా కలెక్టర్ సూచించారు.


ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ జిలాలోని రెండు అంతర్ రాష్ట్ర చెక్‌పోస్ట్‌ల వద్ద ఆబ్కారీ, వాణిజ్య పన్నులు, అటవీ, పోలీస్ వంటి శాఖల సమన్వయంతో సమీకృత చెక్ పోస్ట్ ను ఏర్పాటు ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చేసి డబ్బు, మద్యం, కానుకలు వంటి తరలింపులను గుర్తించి స్వాధీన పరచుకో వడంతో పాటు కేసులు నమోదు చేయాలని అన్నారు. పోలీస్, రెవిన్యూ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సరిగ్గా ప్రవర్తనా నియమావళి సరిగ్గా అమలు జరిగేలా చూడాలని కోరారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌డిఓలు తదితరులు పాల్గొన్నారు.





జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎస్పీ సింధుశర్మ, కలెక్టర్ జితేశ్ వి పాటిల్

# 'హస్తం' వైపు 'కారు' చూపులు



- పార్టీ మారేందుకు బీఆర్ఎస్ నాయకుల ప్రయత్నాలు
- ఏటూ తేల్చుకోక మల్లగుల్లాలు పడుతున్న పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

అధికారం మారిన తర్వాత.. పలువురు బీఆర్ఎస్ నాయకులు పార్టీ మారేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు. కాంగ్రెస్‌లో చేరుదమా..? వద్దా అంటూ తటపటాయిస్తున్నారు. ఇతర నియోజకవర్గాల్లో పెద్దఎత్తున ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతుండగా.. బాల్కొండ నియోజకవర్గంలో చేరేందుకు వెనుకాముందు అవుతున్నారు. ఇతర చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ తీర్థం పలువురు పుచ్చుకున్నారు. అయితే బాల్కొండలో ఎమ్మెల్యేగా కొనసాగుతుండటంతో పార్టీ మారేందుకు ఆలోచన చేస్తున్నారు. అంతిమంగా కాంగ్రెస్‌లో చేరేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నట్టు సమాచారం.

అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీ గత పదేళ్ల కాలం తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సందర్భంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ, బీజేపీ ఇతరత్ర పార్టీల నుంచి రాజకీయ నేతలు, పలువురు ప్రముఖులు, ముఖ్య నాయకులు, మాజీ ఐఏఎస్, ఐపీఎస్, ప్రొఫెసర్ లు సైతం అప్పటి (టీఆర్ఎస్) బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇలా బీఆర్ఎస్ పార్టీ ప్రస్థానం పదేళ్ల పాటు కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆనాడు బీఆర్ఎస్ పార్టీలో చేరిన రాజకీయ ప్రముఖులు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు.

**బాల్కొండ నియోజకవర్గంలో రసవత్తరం**

ఇది ఇలా ఉంటే బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీల నేతల చూపు మరోరకంగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ముత్యాల సునీల్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, బీజేపీ నుంచి ఏలేటి అన్నపూర్ణమ్మ బరిలో నిలిచారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి బరిలో దిగిన మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి పై నాలుగు వేల పై చిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచారు. మూడో స్థానానికి బీజేపీ పరిమితం అయింది. ఈ నేపథ్యంలో బాల్కొండ నియోజకవర్గంలో రసవత్తర మార్పులు చోటుచేసుకునే అవకాశం వుందని రాజకీయ ప్రముఖులు విశ్లేషిస్తున్నారు. దాదాపు పదేళ్ల కాలం తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని నడిపించిన సమయంలో ఐదేళ్ళ పాటు రాష్ట్ర మంత్రిగా పనిచేసిన అనుభవం ప్రశాంత్ రెడ్డిది. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిచి ముచ్చటగా మూడోసారి అసెంబ్లీలో అడుగు పెట్టారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో కాలుమోపిన, అధికారం కాంగ్రెస్ పార్టీకి దక్కడంతో బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకుల్లో రాజకీయ గుబులు మొదలైంది. ఎటు అర్థం కానీ పరిస్థితుల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు. పార్టీ మారుదామనుకుంటే ఎమ్మెల్యేగా ప్రశాంత్ రెడ్డి కొనసాగుతుండటంతో అంతర్మథనంలో పడిపోయారు. ఒకవైపు బాల్కొండ ఎమ్మెల్యేగా మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యేగా వేముల ప్రశాంత్ రెడ్డి కొనసాగుతుండగా, మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం పట్ల బీఆర్ఎస్ పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు రాజకీయ మార్పులకై మంతనాలు నెరుపుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల బీఆర్ఎస్ పార్టీల మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, సొసైటీ చైర్మన్ లు, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సైతం కాంగ్రెస్ పార్టీ వైపు మారేలా మంతనాలు జరుపుతూ ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగానే బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు పార్టీ మార్చే క్రమంలో ఈ మధ్య గతకొద్ది రోజుల క్రితం బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డిని కలిసి వచ్చినట్లు నియోజకవర్గంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

**సునీల్ రెడ్డి గ్రాఫ్ తగ్గేలా ప్రయత్నాలు**

బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు రాజకీయ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి రాకుండా ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి అడ్డుకుంటున్నారానే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు వారి స్వలాభం కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం బాల్కొండ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలో చురుకైన నేతలు, నాయకులు లేకపోవడంతో నియోజకవర్గ స్థాయిలో ముత్యాల సునీల్ రెడ్డి ఎమ్మెల్యేగా ఓడినా రాష్ట్రంలో ప్రస్తుతం ఆయనకు సముచిత స్థానం ఉంది. ఇదే నియోజకవర్గ నికి చెందిన మాజీ విప్ ఈరవత్రి అనిల్ కు తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గా, మరోవైపు మానాల మోహన్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ గా అవకాశం దక్కింది. నియోజకవర్గ స్థాయిలో మార్పులు జరిగేలా తిరిగి మళ్ళీ మా రాజ్యమే కొనసాగేలా రాజకీయ ఎత్తుగడలకై బీఆర్ఎస్ పార్టీ నేతలు సమాలోచనలు మొదలు పెట్టారు. అందుకు జిల్లాలోని పలువురు కాంగ్రెస్ పెద్దలను కలిసి రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నట్లు సమాచారం. పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరితే సునీల్ కుమార్ రెడ్డి గ్రాఫ్ ఇక కాంగ్రెస్ పార్టీలో కనుమరుగు అవుతుందని నియోజకవర్గ ప్రజలు అనుకుంటున్నారు. దీంతో బాల్కొండ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు రసవత్తరంగా మారుతున్నాయి.

## వ్యాసరచన పోటీలో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కామారెడ్డి

2023-2024 సంవత్సరానికి కామారెడ్డి జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, మనీ మేనేజ్మెంట్ అంశాలకు సంబంధించి నిర్వహించిన వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం నినాదాలు రాయడం వంటి అంశాలలో నిర్వహించిన పోటీలలో అడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని జి. రక్షిత, ఎనిమిదవ తరగతికి చెందిన శృతిక మొదటి స్థానాలను పొందారు. మంగళవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో విద్యార్థులకు బహుమతులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అందించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ సుధీర్ భార్గవ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

**నవతెలంగాణ-బోధన్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ప్రకటన చేయడంతో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం బోధన్ పట్టణంలోని రైస్‌మిల్ భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. రెడ్డి కార్పొరేషన్‌కు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి మండలికి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శరత్‌రెడ్డి, విశాల్‌రెడ్డి, వీరారెడ్డి, రమేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశం



**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

మండలంలోని అర్గుల్ గ్రామంలో అమ్మ ఆదర్శ కమిటీ సమావేశం మంగళవారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పాఠశాలలోని మౌలిక వసతులు, పాఠశాల నిర్వహణ మహిళా సంఘాలకు బాధ్యతనివ్వడం జరిగిందని తెలిపారు. పాఠశాల కమిటీ చైర్మన్‌గా గ్రామ సంఘం అధ్యక్షురాలు ఉంటారని, కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయులు ఉంటారని, మెంబర్లుగా చదువుతున్న విద్యార్థుల తల్లులు మహిళా సంఘాల్లో ఉన్నవారే ఉంటారని తెలిపారు. పాఠశాల నిర్వహణకు గ్రామ సంఘం అధ్యక్షురాలితో ప్రధానోపాధ్యాయుడు జాయింట్ అకౌంటు తీయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు, వివోఏలు, విద్యార్థుల తల్లులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

- ఎమ్మెల్యే ధన్‌పాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. దుబ్బ, నాందేవాడ 36వ డివిజన్‌లో ఉన్న జోన్-1 పారిశుధ్య వార్డ్‌ను మంగళవారం ఉదయం 5 గంటలకు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికుల హాజరు రికార్డు, మున్సిపల్ బిల్స్ తదితర రికార్డ్స్ పరిశీలించిన అనంతరం 43,36 డివిజన్‌లో పర్యటించి కార్మికుల పనితీరు, డ్రైనేజ్ చెత్త సేకరణ పనులను పరిశీలించారు. అనంతరం ధన్‌పాల్ మాట్లాడుతూ.. నాందేవాడ జోన్-1 పారిశుధ్య వార్డులో మొత్తం కార్మికులు 180పైన ఉన్నారని, ఈ రోజు 126 మంది హాజరయ్యారని తెలిపారు. మిగతా వార్డుల్లో త్వరలో తనిఖీ చేస్తానని శానిటేషన్ విషయంలో కార్మికులు, అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని, నగరంలో ఉన్న ప్రతి కాలనీలో పరిశుభ్రంగా చేసే బాధ్యత మనపైన ఉందన్నారు. ఆరోగ్యావంతమైన జీవితం గడపడానికి పరిశుభ్రత చాలా ముఖ్యం అన్నారు. తప్పు చేసే అధికారులను క్షమించేది లేదని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, వార్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పంచాయతీ అవార్డులకు సిద్ధం కావాలి

- డిఎల్‌పిఓ సాయి బాబా



మాట్లాడుతున్న డిఎల్‌పిఓ సాయిబాబ

**నవతెలంగాణ-రెంజల్**

గ్రామాల అభివృద్ధి, 100శాతం ఇంటి పన్నుల వసూళ్లను త్వరితగతంగా పూర్తి చేసి జాతీయ పంచాయతీ అవార్డులకు సిద్ధం కావాలని డిఎల్‌పిఓ సాయిబాబా గ్రామ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం మండలంలోని నీల గ్రామ పంచాయతీ యాప్‌ను సందర్శించి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామ కార్యదర్శి ప్రతిరోజు గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిని సారిస్తూ రికార్డులను పూర్తి చేయాలని వారికి సూచించారు. పంచాయతీకి సంబంధించిన డాటా మొత్తం ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. సమస్యలు ఎదురైనా తనను సంప్రదించినట్లయితే వాటికి పరిష్కారం మార్గాలను సూచిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీ ఓ గౌస్ ఉద్దీన్, మండలంలోని గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అన్నిరంగాల్లో పోటీపడుతున్న మహిళలు

- వైద్యురాలు డాక్టర్ కవితారెడ్డి



మాట్లాడుతున్న జేవివి రాష్ట్ర అధ్యక్షులు నర్రా రామారావు

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

భూమి, ఆకాశం, సముద్ర గర్భం, అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు పోటీపడుతున్నారని ప్రముఖ మహిళ వైద్యురాలు డాక్టర్ కవితారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రగతి నగర్‌లోని ఉషోదయ మహిళా డిగ్రీ కాలేజీలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కవితారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న అన్ని విషయాలు తెలుసుకోవాలని, తన కాళ్లపై తాను నిలబడి శారీరకంగా, మానసికంగా దృఢంగా, ధైర్యంగా మహిళలు ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. జేవివి రాష్ట్ర అధ్యక్షులు నర్రా రామారావు మాట్లాడుతూ.. ఓటు హక్కును మహిళలు వినియోగించుకోవాలని రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన చేసుకుని ముందుకు వెళ్లాలని, అప్పుడే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. కోయెడి నర్సింలు మాట్లాడుతూ.. శాస్త్రీయంగా ఆలోచిస్తూ, మూఢవిశ్వాసాలను నమ్మకుండ మహిళలు ముందుకెళ్లాలని అన్నారు. అనంతరం డాక్టర్ కవితారెడ్డికి డాక్టర్ రామ్మోహన్ రావులను సన్మానించారు. కళాకారులు సిర్పలింగం బృందం పాటలు పాడారు.. ఉషోదయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఉమెన్ రైట్స్ రాష్ట్ర పిఆర్‌ఓ ప్రమోద్, శ్రీనివాస్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వాహనాన్ని పరిశీలించాలి

- కలెక్టర్, సీపి
- జిల్లా సరిహద్దు చెక్ పోస్టు సందర్శన



తనిఖీ చేస్తున్న అధికారులు

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మండల కేంద్రం శివారులోని శ్రీగిరి క్షేత్రం సమీపంలో 63వ నంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్ పోస్టును మంగళవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, కమిషనర్ కల్మేశ్వర్ సందర్శించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏర్పడిన చెక్ పోస్ట్‌ను వారు పరిశీలించారు. చెక్ పోస్ట్ గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. చెక్ పోస్ట్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఒక వ్యక్తి 50 వేలకు మించి డబ్బుతో ప్రయాణం చేయాల్సి వస్తే అందుకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. వీరి వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ ఏసిపి బస్వారెడ్డి, తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, కమ్మర్‌పల్లి ఎస్ఐ రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

# కందకుర్తిఘాట్ల వద్ద చెత్తాచెదారం

- భక్తులకు అసౌకర్యం



ఘాట్‌వద్ద పేరుకుపోయిన చెత్త

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం ప్రధాన ఘాట్ల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి భక్తులకు అసౌకర్యంగా మారిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి శుక్ర, సోమవారాలలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్నానాలను ఆచరిస్తారు. గాట్లపై బురద పేరుకుపోయి నడవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుందని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు పుష్కరాల సమయంలో వచ్చిన హుండీ డబ్బులను తీసుకువెళ్లడం తప్ప ఘాట్లను పరిశుభ్రం చేయడంలో విఫలమయ్యారని వారు ఆరోపిస్తున్నారు. దేవాదాయ శాఖ కానీ, పుష్కర కమిటీ సభ్యులు కానీ ఘాట్ల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# రైతు బీమా చెల్లించక పోవడంతోనే నష్టం

- చెప్పింది చేస్తున్నం
- ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి
- పంట పొలాల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమే నేడు రైతులకు తీరని అన్యాయం జరిగిందని, రైతు బీమా కట్టిఉంటే ఈ పరిస్థితి ఉండేదికాదని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం ఇందల్‌వాయి మండలంలోని మెగ్యానాయక్ తండా, నల్లవెల్లి, డొంకల్, డిచ్‌పల్లి మండలంలోని సుద్దులం, కోరట్‌పల్లి గ్రామాల్లో నాలుగు రోజుల క్రితం వడగండ్ల వర్షానికి నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయికి వెళ్ళి పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు బీమా అమలు చేశామని, అది వచ్చే వర్ష కాలం నుంచి అమలులోకి వస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని, ఆనాడు అమలు చేసి ఉంటే రైతులకు మేలు జరిగేదని, గత ప్రభుత్వ తప్పిదాలతో రైతు బీమా చేయలేదని వివరించారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో వరి పంట తోపాటు, ఇతర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించి నష్టపరిహారం అందే విధంగా చూస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, అనాడు రైతులకు సబ్సిడీపై ఎన్నో పరికరాలను, డ్రిప్‌ను అందజేశామని, రైతులు ఎలాంటి ఇబ్బందులు, ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. రైతులకు 24గంటల పాటు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, డ్రిప్ పరికరాలను సబ్సిడీపై ఇచ్చేందుకు ప్రభుత్వం ఆలోచిస్తుందని అన్నారు. ఒక్క నల్లవెల్లి గ్రామంలోనే దాదాపు 15వందల ఎకరాల పైనే నష్టం వాటిల్లిందని, వడగండ్ల వర్షం వచ్చిన వెంటనే కలెక్టర్‌కు నష్టపోయిన పంటలను పరిశీలించి నివేదికను అందజేయాలని కోరినట్లు వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన రైతుల వివరాలు తెలుసుకుని నివేదిక అందజేయాలని చెప్పానన్నారు. ఎమ్మెల్యే వెంట కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పా గంగారెడ్డి, మునిపల్లి సొసైటీ చైర్మన్ సాయిరెడ్డి, ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, ధర్పల్లి మాజీ ఎంపీపీ ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇమ్మడి గోపి ముదిరాజ్, ఇందల్‌వాయి, డిచ్‌పల్లి మండల అధ్యక్షులు మోత్కూరి నవీన్‌గౌడ్, అమ్మతాపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంతోష్‌రెడ్డి, పోలసాని శ్రీనివాస్, కిషన్ ఖేత్ అధ్యక్షులు ఎల్‌ఐసి గంగాధర్, డిసిసి డెలిగేట్ వెంకట్‌రెడ్డి, సుధాకర్, సీనియర్ నాయకులు డాక్టర్ శాదుల్లా, డాక్టర్ జాహుర్, దశరథ్, బైరయ్య, బద్దంరెడ్డి, జమీల్ పాషా, రాములు నాయక్, ఎంపిటిసి నర్సయ్య తదితరులు ఉన్నారు.

# సేవా కార్యక్రమాలు అభినందనీయం

- ఏసిపి బస్వారెడ్డి




వివిధ రంగాల్లో రాణించిన వారిని సన్మానించిన ఏసీపీ, తదితరులు

**నవతెలంగాణ-ఆర్మూర్**

సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బస్వారెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో "రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్స్ సర్వీస్ అవార్డ్స్-2024 పట్టణంలోని పెర్కిట్ ఎమ్మార్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తూ సమాజసేవలు అందిస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేశారు. వారిలో గోస్కొండ అశోక్ (స్వచ్ఛ భారత్ స్వచ్ఛ కాలనీ నిర్వహణ), మాదరి స్వామీ (బ్లడ్ బ్యాంక్ నిర్వహణ), గణేష్, అరుణ్ (108 అంబులెన్స్ నిర్వహణ), లక్ష్మీదుర్గ (న్యూస్ రీడర్), సుమన్ (అధ్యాత్మిక నిర్వహణ), బొండ్ల ఆనంద్ (మిమిక్రీ రంగం), రవీందర్ (ఇరిగేషన్, సేవ దృక్పథం), మోహన్ (ఉచిత కుట్టు మిషన్, మగ్గం శిక్షణ), చౌకే లింగం (జానపద కళలు), జింధం నరహరి (కవితా మాల, గాయకుడు), మహతి ఆశ్రమం బాల్కొండ. వారికి ముఖ్య అతిథి ఏసిపి బస్వారెడ్డి ఎంఈఓ రాజ గంగారాం, సీఐ రవి కుమార్, హనుమంత రెడ్డి, అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ, కార్యదర్శి పట్వారీ తులసి చేతుల మీదుగా వార్డుల ప్రధానోత్సవం చేశారు. మహతి ఆశ్రమ విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఏసిపి మాట్లాడుతూ.. సేవ చేయడం అదృష్టమని, సేవ చేసే శక్తిని ఆ భగవంతుడు ప్రసాదిస్తేనే మనం సేవ చేయగలం, సేవ పొందిన వ్యక్తులు సేవ చేసిన వారిని మర్చిపోకూడదని, సేవ చేసే ఆనందం వెలగట్టలేనిది అని, రోటరీ సేవలు స్ఫూర్తిదాయకమని అన్నారు. మండల విద్యాధికారి రాజ గంగారాం మాట్లాడుతూ.. వివిధ రంగాల వ్యక్తులను సేవ చేయడం స్ఫూర్తిదాయకమని సమాజం పట్ల వీరికి మరింత బాధ్యత సేవ చేసే దృక్పథం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పిడిజి హనుమంత్‌రెడ్డి, ఫాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ విజయ సారథి, చరణ్‌రెడ్డి, కోశాధికారి లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షులు ప్రాజెక్ట్ చైర్మన్ పుష్పకరావు, సభ్యులు కాంతి గంగారెడ్డి, లింగాగౌడ్, ప్రవీణ్ పవార్, సురేష్, చౌటి లింబాద్రి, లింబాద్రిగౌడ్, రజనీష్ కిరాడ్, ఖాందేశ్ సత్యం, రాము, ఆనంద్, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## భీంగల్ బస్ డిపోను అభివృద్ధి చేయండి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి



మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

భీమ్గల్ బస్ డిపోను అభివృద్ధి చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిసి భీంగాల్ బస్ డిపోలో పూర్తి స్థాయి అధికారులను నియమించి డిపో అభివృద్ధికి కృషి చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ మానాల మోహన్ రెడ్డి పొన్నం ప్రభాకర్ తో మాట్లాడుతూ.. 1989లో కాంగ్రెస్ ప్రభుత్వంలో బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండలంలో ఏర్పాటు చేసినటువంటి బస్ డిపోను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించి మూసివేశాయన్నారు. ఇటీవల బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఆలోచనతో సుమారు నాలుగు నెలల క్రితం బస్ డిపోను పున్నప్రారంభించి ప్రజలను మభ్యపెట్టిందని, కానీ ఇప్పటివరకు పూర్తి స్థాయిలో బస్సులను గాని, సిబ్బందిని గాని నియమించలేదన్నారు. కావున పున్నప్రారంభమయిన భీంగల్ బస్ డిపోలో పూర్తిస్థాయిలో సిబ్బందిని, బస్సులను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతోపాటు పిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, బాల్కొండ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగేంద్ర, మహేష్, నిఖిల్ రెడ్డి పాల్గొన్నారు.

## తండ్రి వద్దకు చేరిన పాప

- తప్పిపోయిన చిన్నారిని గంటలోపు పట్టుకున్న పోలీసులు

**నవతెలంగాణ-ఆర్మూర్**

తప్పిపోయిన పాపను పోలీసులు గంటలోపు తండ్రి వద్దకు చేర్చారు. ఈఘటన మంగళవారం పట్టణంలో వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని రాజారాం నగర్ కాలనీకి చెందిన షేక్ నహీం కూతురు షేక్ మహేరా (7) తప్పిపోయిందని పాప తండ్రి 100 కి కాల్ చేసి పోలీసులకు వివరాలను వెల్లడించారు. దీనికి స్పందించిన పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్ ఆదేశాల మేరకు పోలీసులతో పరిసర ప్రాంతాల్లో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. మూగ పాప తమ ఇంటివద్ద ఆడుకుంటూ మామిడిపల్లి చౌరస్తా వరకు వెళ్ళింది. పాపను కానిస్టేబుల్ రాములు, హోంగార్డు స్వామి పాపను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. తదననంతరం పాప తండ్రికి కాల్ చేసి ఎస్‌హెచ్‌ఓ సమక్షంలో తండ్రి షేక్ నహీం కు అప్పగించారు. చాకచక్యంతో పాపను పట్టుకున్న కానిస్టేబుల్, హోంగార్డును ఎస్‌హెచ్‌ఓ అభినందించారు.



పాపను తండ్రికి అప్పగించిన పోలీసులు

## పశువులకు గాలికుంటు నివారణా టీకాలు

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

ప్రభుత్వం ద్వారా ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలను పశువులకు వేయించాలని మండల పశువైద్యాధికారి శిరీష అన్నారు. మండలంలోని కేసుపల్లి గ్రామంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను ఇచ్చామని తెలిపారు. పశువులు ఉన్న రైతులు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది గోపాలమిత్ర రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

**నవతెలంగాణ-బోధన్**

బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామానికి చెందిన బాబయ్య, పోచమ్మ నిరుపేద దంపతులు ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్థాపనికి గురయి మంగళవారం నిజామాబాద్ సమీపంలో ఒకరికొకరు తాళ్లు కట్టుకుని కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. వారి అంత్యక్రియలకు డబ్బులు లేక పోవడంతో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సిర్ప సుదర్శన్ 5వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు.

## రెండో రోజు ప్రశాంతం.. కేంద్రాల పరిశీలన

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ప్రత్యేక స్క్వాడ్ కోటగిరి ఎంఈఓ నాగనాథ్ బృందం మంగళవారం పరిశీలించారు. ఇన్విజి లెటర్లు మాస్ కాపీ జరగకుండా ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా చూడాలన్నారు. ఆదర్శ పాఠశాలతో పాటు, నీల జిల్లా పరిషత్ పాఠశాలలను వారు తనిఖీలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్, ఏఎస్ఐలు, పాల్గొన్నారు.

## స్కూల్ యూనిఫాం కుట్టేవారికి శిక్షణ



మాట్లాడుతున్న ఏపీఎం రవీందర్

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో స్కూల్ యూనిఫామ్ కుట్టే వారికి శిక్షణ ఇచ్చినట్టు ఏపీఎం రవీందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందిస్తుందని, ఏకరూప దుస్తులను కుట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పజెప్పడం జరిగిందన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మహిళా సంఘాల సభ్యులతో ఏకరూప దుస్తులు కుట్టించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ఒక్క ఏకరూప యూనిఫాంకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల మహిళా సమైక్య సిబ్బంది ఉన్నారు.

## నేడు శ్రీ వాగ్దేవి పాఠశాల వార్షికోత్సవం

**నవతెలంగాణ-ఎడపల్లి**

మండల కేంద్రంలోని శ్రీ వాగ్దేవి పాఠశాలలో బుధవారం పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ నార్ల కాశీనాథ్ గుప్తా తెలిపారు. 2004లో మండల కేంద్రంలో నర్సరీ ఎల్కేజీ యూకేజీ నుండి ఐదవ తరగతి వరకు కొనసాగగా ప్రస్తుతం ఏడవ తరగతి వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. క్రమశిక్షణతో పాటు ఆటలు. పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు తోపాటు నాణ్యమైన విద్య బోధన ఉంటుందని భావించి తల్లిదండ్రులు తమ పిల్లలను వాగ్దేవి పాఠశాలలో చేర్పించడం హర్షిణీయమని తెలిపారు. బుధవారం సాయంత్రం పాఠశాల 20వ వార్షికోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ నార్ల కాశీనాథ్ గుప్తా పేర్కొన్నారు. బాల బాలిక తల్లిదండ్రులతోపాటు అధికారులు, అధికారులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## 23న ఉచిత క్యాన్సర్ హెల్త్ క్యాంపు

**నవతెలంగాణ-ఆర్మూర్**

గ్రేస్ ఫౌండేషన్ సౌజన్యంతో క్యాన్సర్‌గా నివారణకే ఆలూరు మండలంలోని మచ్చర్ల గ్రామంలో ఈనెల 22న శుక్రవారం ఉచిత క్యాన్సర్ హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా సబ్ డివిజన్ కార్యదర్శి బట్టు కిషన్, నాయకులు మాచర్ల రాజన్న, జక్కం శేఖర్, రాజు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రచారం చేయడం జరిగింది క్యాన్సర్ పై గ్రామాలలో అవగాహన కలిగించి సరైన చికిత్స అందేలా కృషి చేద్దామని అన్నారు. క్యాంపులో గర్భసంచి క్యాన్సర్ కోసం పాప్. స్మియర్ పరీక్ష, రొమ్ము క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ పరీక్షలు, షుగర్, ఫిజికల్ వంటి టెస్టులు నిర్వహిస్తారని తెలిపారు. క్యాంపును పేద, మధ్యతరగతి, ప్రజలకు అనేక విధాలుగా ఉపయోగపడుతుందని వారు తెలిపారు.

## బెల్లయ్య నాయక్‌కు సన్మానం



**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

తెలంగాణ రాష్ట్ర గిరిజన డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ను నిజాంబాద్ జిల్లా లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మోహన్ మంగళవారం సన్మానించారు. బెల్లయ్య నాయక్ నూతనంగా నియమితులైన సందర్భంగా పూల బొకే అందజేసి సన్మానించినట్లు మోహన్ తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు చౌహాన్ మోహన్ నాయక్, మానిష్ నాయక్, పాల్గొన్నారు.

## సెంట్రల్ లైటింగ్‌కు మోక్షమెన్నడో..?

నవతెలంగాణ-మద్నూర్



పాత తాలూకా కేంద్రం ప్రస్తుత మండల కేంద్రంలో సెంటర్ లైటింగ్ నిర్మాణం కోసం ఆరు మాసాల క్రితం శంకుస్థాపన చేసిన పనులు మాత్రం జరగడం లేదు. అప్పటి ప్రభుత్వం తొమ్మిది కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్టు గత ఎమ్మెల్యే తెలిపారు. సెంటర్ లైటింగ్ కోసం అప్పట్లో సర్పంచ్ సైతం పనులు చేపట్టారు. కానీ పనులు నిలిచిపోవడంతో మళ్లీ ఎప్పుడు ప్రారంభిస్తారని మండలకేంద్ర వాసులు ఎదురుచూస్తున్నారు. మద్నూర్ అభివృద్ధి అంటే శిలాఫలకం పూజ, భూమి పూజలకే పరిమితమా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

## నవజాత శిశువుకు బి నెగిటివ్ రక్తం అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి




కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో నవజాత శిశువు (ఐదు రోజుల క్రితం జన్మించిన చిన్నారికి) బి నెగిటివ్ రక్తం అవసరం కావడంతో వారికి ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలును సంప్రదించడంతో పాల్వంచ గ్రామానికి చెందిన అంకాలపు నవీన్ సహకారంతో బి నెగిటివ్ రక్తాన్ని అందజేశారు. నవీన్ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తూ యువతకు ఆదర్శనంగా నిలుస్తున్నారని తెలిపారు.



కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి

## నవజాత శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనే అని కుటుంబీకుల ఆరోపణ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నవజాత శిశివు మృతిచెందింది. వైద్యులు అందుబాటులో ఉంటే శిశువు బతికేదని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకోగా మంగళవారం వెలుగుజూసింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని గోదాం గడ్డలో నివాసం ఉంటున్న అర్జున్-ధనలక్ష్మి భార్యభర్తలు. ధనలక్ష్మి డెలీవరి కోసం ప్రభుత్వ ఆస్పత్రికి రాగా సోమవారం ఉదయం 6 గంటలకు ఆడశిశువుకు జన్మనిచ్చింది. ఆ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు పాప బాగానే ఉంది అని అన్నారు. ఆ తర్వాత ఉదయం 11 గంటల ప్రాంతంలో పాపకు కొద్దిగా ప్రాబ్లం ఉంది పిల్లల ఆసుపత్రిలో చూపించాలని సూచించడంతో పక్కనే ఉన్న ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం శిశురక్ష ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందింది. పాప జన్మించినప్పుడు బాగానే ఉందని వైద్యులు చెప్పారని, కానీ లంగ్స్‌లో పాలు రావడంతో మృతిచెందినట్టు తెలిసిందని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో పిల్లల వైద్యులు ఉండి ఉంటే.. పాప జన్మించగానే పరిక్షించే వారని లంగ్స్‌లో నుంచి పాలు తీసేసేవారని దీంతో తమ పాప బతికేదని వాపోయారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ పాప మృతిచెందినట్టు ఆవేదన వ్యక్తం చేశారు.

### గత రబీ ధాన్యం

# బిడ్డర్లకు అప్పగించాలి

- ఎలాంటి ఇబ్బందులు పెట్టొద్దు
- రైస్‌మిల్లర్‌లతో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

గత రబీకి సంబంధించిన ధాన్యాన్ని బిడ్డర్లకు ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా అప్పగించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ రైస్ మిల్లర్లను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 2022 - 23 రబీకి సంబంధించి 1.61వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలం వేసి బిడ్డర్లకు కేటాయించిందని వెల్లడించారు. జిల్లాలోని 85 రైస్ మిల్లర్లకు కేటాయించిన రబీకి సంబందించిన అట్టి ధాన్యాన్ని ఎటువంటి సాకులు, ఇబ్బందులు పెట్టకుండా బిడ్డర్లకు అప్పగించాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా 2023 - 24 ఖరీఫ్ కు సంబంధించిన రైస్ బీమిల్లర్లకు కేటాయించిన 4. 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆ రైస్ మిల్లు సామర్థ్యం మేరకు ప్రతి రోజు మరాడించి ప్రభుత్వానికి అప్పగించవలసినదిగా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు, ఇంచార్జి పౌరసరఫరాల జిల్లా మేనేజర్ నిత్యానందం, రైస్ మిల్లుల సంఘం జిల్లా అధ్యక్షులు లింగం, డివిజన్లలోని అధ్యక్షులు, కార్యదర్శులు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

### పెండింగ్ రుణాల చెల్లింపులకు

# వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఆఫర్

- సింగిల్ విండో కార్యదర్శి జే.బాబురావు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సింగిల్ విండో కార్యాలయంలో దీర్ఘకాలిక రుణాల పెండింగ్ బకాయి లబ్ధిదారులకు వన్‌టైమ్ సెటిల్మెంట్ అవకాశాన్ని కల్పించినట్లు సింగిల్ విండో కార్యదర్శి జె బాబురావు తెలిపారు. సొసైటీలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సింగిల్ విండో పరిధిలో 145 మంది వద్ద దీర్ఘకాలిక రుణం కింద వడ్డీ అసలు కలిసి ఏడు కోట్ల 98 లక్షలు బకాయిలు ఉన్నట్లు వివరించారు. 145 మంది పేరుతో దీర్ఘకాలిక రుణాల కింద అసలు తీసుకున్న రుణం బకాయి 4 కోట్ల 75 లక్షలు ఉన్నట్లు అసలు రుణం వడ్డీతో కలిసి రెట్టింపునకు చేరుకుంది. అసలు వడ్డీ కలిపి లెక్కేస్తే 7 కోట్ల 98 లక్షలు బకాయి ఉన్నట్లు ఆయన వివరించారు. ఇలాంటి మొండి బకాయి దారులకు వన్ టైమ్ సెటిల్మెంట్ ద్వారా రుణం కట్టుకునే అవకాశాలు కల్పించినట్టు తెలిపారు. పెండింగ్ బకాయి లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. ఈ అవకాశం మార్చి 31 వరకు ఉన్నందున దీర్ఘకాలిక రుణాల లబ్ధిదారులంతా మొండి బకాయి చెల్లించుకుని రుణ బకాయిలు వన్ సెటిల్మెంట్ ద్వారా ఎంతో లాభం చేకూరుతుందని ప్రతి ఒక్కరూ వన్ సెటిల్మెంట్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మళ్లీ ఇలాంటి అవకాశం రాదని తెలిపారు.



## నూతన ఆర్డీవోకు సన్మానం



ఆర్డీవోను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-జుక్కల్/బిచ్కుంద

బాన్సువాడ డివిజన్ ఆర్డీవోగా బాద్యతలు చేపట్టిన రమేష్ రాథోడ్‌ను కాంగ్రెస్ పార్టీ జుక్కల్ మండల నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.వినోద్, కేమ్రాజ్ కల్లాలీ మాజీ సర్పంచ్ సుంకరి వెంకటి, మహమ్మదాబాద్ మాజీ సర్పంచ్ లక్షెట్టి సాయులు, తదితరులు పాల్గొన్నారు.

# వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని సభ్యుల ఆరోపణ

నవతెలంగాణ-సదాశివనగర్

మండల సర్వసభ్య సమావేశం ఎం.పి పి గైని అనసూయ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదని అధికారులు తనిఖీలు చేపట్టడం లేదని మండల విద్యాశాఖ అదికారి యెషఫ్ ను సదాశివనగర్ ఎంపిటిసి భీరయ్య నిలదీశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యపై నమ్మకం కోలుపోతున్నారని అన్నారు. సదాశివనగర్ ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా 11-00 గంటల వరకు ఒక ఉపాధ్యాయుడు రాలేదని ఎంఈవో దృష్టికి తీసుకెళ్లారు. సదాశివనగర్ లో 16 మంది ఉపాధ్యాయులు ఉంటే పాఠశాలకు 4 గురు హాజరయ్యారని సమావేశంలో తెలిపారు.

గహ జ్యోతిలో పాత బకాయిలు తప్పకుండా చెల్లించాలని సదాశివనగర్ విద్యుత్ ఏ.ఈ దర్మారెడ్డి తెలిపారు. ఎం పి.ఓ సురెందర్ రెడ్డి ని సదాశివనగర్ లో అనుమతులు లేకుండా ఇండ్లు నిర్మాణం చేస్తున్న రని మండిపడ్డారు. దేవాలయ భూములలో కూడ ఇండ్లు నిర్మించారని సూచించారు. కొందరు అధికారులు గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎం.పి.పి గాదారి శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ టిసి కమిలి నర్సింలు, జడ్పీ కొ అప్షిన్ మెంబర్ మోహినోద్దిన్., తహశీల్దార్ గంగా సాగర్ ,ఎంపిడిఓ సంతోష్ కుమార్ ప్రత్యేక అధికారులు. ఎం.పి.టి.సిలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

### పదవ తరగతి

## హిందీ పరీక్ష ప్రశాంతం

నవతెలంగాణ-రామారెడ్డి/దోమకొండ

మండలంలో పదవ తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా మంగళవారం హిందీ పరీక్ష ప్రశాంతంగా ముగిసాయి. రెడ్డిపేట సెంటర్లో 165 మంది విద్యార్థులకు గాను 165 మంది విద్యార్థులు, ఉప్పల్ వాయి లో 153 మంది విద్యార్థులకు గాను 153 మంది విద్యార్థులు, రామారెడ్డి సెంటర్లో 185 మంది విద్యార్థులకు గాను 184 మంది విద్యార్థులు హాజరై, ఒకరు గైహాజరైనట్లు ఎంఈఓ యోసేఫ్ తెలిపారు.

**దోమకొండ :** దోమకొండ మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 162 మంది విద్యార్థులు, జడ్పీ హెచ్ యస్ బాలికల పాఠశాలలో 200 మంది విద్యార్థినిలు పదో తరగతి హిందీ పరీక్షకు హాజరైనట్టు తెలిపారు. రెండో రోజూ ప్రశాంతంగా ముగిసినట్టు ఎంఈవో ఎల్లయ్యా మంగళవారం తెలిపారు.

## లింగంపేట్ ఎంపీడీవోగా అబ్బగౌడ్

నవతెలంగాణ-లింగంపేట్



లింగంపేట్ ఎంపీవోగా అబ్బగౌడ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ప్రభాకర చారి బదిలీపై మాచారెడ్డి మండల పరిషత్‌కు వెళ్లారు. దీంతో ఆ స్థానంలో నిజాంసాగర్ మండల పరిషత్ లో పనిచేస్తున్నటువంటి అబ్బ గౌడును బదిలీ చేశారు.

# ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

- దాతలు ఆదుకోవాలని భార్య విన్నపం

నవతెలంగాణ-రామారెడ్డి



తలలో రక్తం గడ్డ కట్టడంతో ఆపరేషన్ కోసం డబ్బులు అవసరం ఉండడంతో, పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న ఆ కుటుంబానికి ఆపన్న హస్తము అందించి ఆదుకోవాలని భార్య వేడుకుంటుంది. మండలంలోని రెడ్డి పేట గ్రామానికి చెందిన మ్యాదరి గణేష్ తలలో రక్తం గడ్డ కట్టడంతో, ఎడమచేతు, కాలు, పక్షవాతంతో నిజామాబాద్ శ్రీ వైష్ణవి హాస్పిటల్ లో వైద్యం కోసం వెళ్ళగా, ఆపరేషన్ చేయాలని, రూ 6 లక్షలు ఖర్చు అవుతాయని చెప్పారు. రెక్క ఆడితే గాని డొక్కాడని కుటుంబంలో ఆపరేషన్ ఖర్చు భరించలేక ఆపన హస్తం కోసం ఎదురుచూస్తున్నామని, దాతలు ముందుకు వచ్చి తన భర్తను కాపాడాలని భార్య లక్ష్మీ వేడుకుంటుంది. ఫోన్ పే నెంబర్ 9542897471, బ్యాంకు అకౌంట్ నెంబర్ 62367008570, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎదీక్కీబీ0020509 గల నెంబర్లకు ఆర్థికం సహాయాన్ని చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

## బాధితునికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ఈ నెల 8న కమ్మరి దత్త్రాద్రికి చెందిన కార్పెంటర్ దుకాణం అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. అతని ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో మానవతా దకృథంతో ఆలోచించి బాధితునికి మంగళవారం దేవునిపల్లి మాజీ సర్పంచ్ నిట్టు వెంకట్ రావు తన వంతు సాయంగా రూ. 15,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు రాములు, మురళి, లక్ష్మీపతి, బాలరాజు, కాంతం తదితరులు పాల్గొన్నారు.



### మల్లు స్వరాజ్యం

## ఆశయ సాధనకు పనిచేయాలి




జోహార్లు అర్పిస్తున్న నాయకులు, మహిళలు

నవతెలంగాణ-భిక్కనూర్

మల్లు స్వరాజ్యం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు తెలిపారు. భూమికోసం భుక్తి కోసం పేద ప్రజలను వెట్టిచాకిరి విముక్తి కోసం నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా తుపాకి పట్టి పోరాటం చేసిన మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతిని మండలంలోని జంగంపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. భూమి కోసం భుక్తి కోసం జరిగిన పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర ముఖ్యమైనదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలయ్య, నర్సింలు, రమణ, శ్యామల, సత్యవ్వ తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి తీర్చేందుకు బోరు డ్రిల్లింగ్



బోరును ప్రారంభించిన నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని పెద్దతడుగూర్ గ్రామంలో బోరు డ్రిల్లింగ్ పనులను కాంగ్రెస్ నాయకులు మంగళవారం ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్తగా జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు నీటి ఎద్దడి గల గ్రామాల్లో బోర్లు వేయించే కార్యక్రమం చేపట్టగా ఎమ్మెల్యే కృషితో నీటి ఎద్దడి నివారణ కోసం పెద్ద తడగూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కొండ వార్ రాజు, ఈరన్న కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు, నాయకులకు గ్రామస్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షునికి సన్మానం



మండల అధ్యక్షుడిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-గాంధారి

యూత్ కాంగ్రెస్ గాంధారి మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బిస గణేష్‌ను మేడిపల్లి కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా బిస గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఎండి అక్బర్, యూత్ ప్రెసిడెంట్ ఎండి మహబూబ్, యూత్ వైస్ ప్రెసిడెంట్ జీ వెంకట్రావు, కార్యదర్శి సిహెచ్ దుర్గ ప్రసాద్, సలహాదారుడు కే బాబు తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-నిజాంసాగర్



ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై

మండల కేంద్రంలోని హసనుపల్లి గ్రామానికి చెందిన కొరడి బిరయ్య అనే వ్యక్తి ఫోన్ పోగొట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సుధాకర్ స్పందిస్తూ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చరవాణిని కనిపెట్టి బాధితునికి మంగళ వారం అప్పగించాడు. ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నట్లైతే బిల్లుతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి యందు ఒక సీటు (బీసీ), ఆరవ తరగతి యందు నాలుగు సీట్లు(ఎం-2,దీజ-1,ఉజ-1) బ్యాక్ లాక్ ఖాళీలు ఉన్నాయని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హెన్రీ ఒక ప్రకటనలో తెలిపారు. సీట్ల భర్తీ కోసం ఇంటర్నెట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన అన్నారు. మార్చి 23వ తారీఖున దరఖాస్తు చేసుకోవడానికి చివరి డేట్ ఉంటుందని ఆయన తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21న ఉంటుందని ఆయన తెలిపారు.

## పోలింగ్ స్టేషన్ సందర్శించిన డీపీవో

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు మండలం లోని పోలింగ్ స్టేషన్ ను జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు మంగళ వారం పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో ఎలాంటి సమస్యలు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారి ప్రవీణ్ కుమార్ కు సూచించారు. అలాగే భిక్కనూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి నెల చివరి వరకు 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్ కు తెలిపారు. కార్యాలయంలోని రికార్డులు పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు.

# రెండోసారి వేలం వాయిదా

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్ర గ్రామపంచాయతీ తై బజార్ వేలం పాట రసవత్తరంగా కొనసాగినప్పటికీ రెండోసారీ వాయిదా పడింది. మంగళవారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి కమలాకర్ అధ్యక్షతన తై బజార్ వేలం పాట నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి గాను వేలంపాట నిర్వహించగా 5 మంది హౌత్సహికులు 2 లక్షల రూపాయలు ధరావతు సొమ్ము డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొన్నారు. తై బజార్ పాటకు గ్రామపంచాయతీ సిబ్బంది 20 లక్షల సర్కార్ సవాల్ నిర్ణయించగా నాటకారి రాజేష్ బాన్సువాడ , మండల కేంద్రానికి చెందిన గాజుల పాష , వడ్ల రవి , గొల్ల లక్ష్మణ్ బాన్సువాడ పట్టణానికి చెందిన ఫారుక్ ల మధ్య పంచముఖి పోటీ నెలకొన్నప్పటికీ నువ్వా నేనా అన్న చందంగా వేలంపాట నిర్వహించారు. చివరకు బాన్సువాడ పట్టణానికి చెందిన ఫారుక్ 12 లక్షల 84 వేల రూపాయల పాట పాడగా ఆయనపై మండల కేంద్రానికి చెందిన వడ్ల రవి 12 లక్షల 85 రూపాయల పాట పాడినప్పటికీ ప్రభుత్వము నిర్ణయించిన ధర రానందున అధికారులు వేలంపాటను రెండవసారి వాయిదా వేశారు. తిరిగి వేలం పాటను నేటికి వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఎం పి ఓ బ్రహ్మం , సెకరెటరీ యాదగిరి , పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తైబజార్ వేలంలో పాల్గొన్న పలువురు ఆశావహులు

## మొక్కజొన్న పంట పరిశీలన

నవతెలంగాణ-సదాశివనగర్

అకాల వర్షంతో మొక్కజొన్న నేలకొరిగింది. మండలంలోని పద్మాజివాడి శివారులో మంగళవారం మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి మొక్క జొన్న పంటను పరిశీలించారు. పద్మాజివాడి గ్రామ నికి చెందిన ఏనుగు కిష్టారెడ్డి పంటను పరిశీలించారు. వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.



మొక్కజొన్నను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

## డీసీబీ నివేదిక ఎంపీఓకు అందజేత


ఎంపీఓకు నివేదికను అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

**నవతెలంగాణ-ఏర్గట్ల**
మండలంలోని నాగేంద్రనగర్ గ్రామంలో 2023-24 సంవత్సరానికి గాను వందశాతం జీపీ పన్నుల వసూలు పూర్తి చేసి డిమాండ్, కలెక్షన్, బ్యాలెన్స్(డీసీబీ)నివేదికను పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి ఎంపీఓ శివ చరణ్‌కు అందించారు. గ్రామంలో వంద శాతం పన్నులు వసూలు చేయడంతో పంచాయతీ కార్యదర్శిని ఎంపీఓ శివ చరణ్ అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీఓ శివ చరణ్ మాట్లాడుతూ...మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు.

## పది పరీక్షలకు 60మంది గైర్హాజరు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**
జిల్లావ్యాప్తంగా నిర్వహించిన పదవ తరగతి పరీక్షలలో ప్రశాంతంగా రెండవ రోజు పరీక్ష నిర్వహించడం జరిగిందని జిల్లా విద్యాధికారి ఎన్వి దుర్గాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 141 పరీక్ష కేంద్రాల్లో 21,896 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 21,836 మంది విద్యార్థులు హాజరుకాగా 60 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మొదటి రోజు పరీక్ష కేంద్రాలకు కలెక్టర్ 01 పరీక్ష కేంద్రం, డీఈవో 10 పరీక్ష కేంద్రాలను, డిస్ట్రిక్ లెవెల్ అబ్జర్వర్ 01 పరీక్ష కేంద్రం, ఫ్లయింగ్ స్క్వాడ్ 47 పరీక్ష కేంద్రాలను తనిఖీలు నిర్వహించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్స్ 141 మంది విధులు నిర్వహించారని అన్నారు.

## అధ్యక్ష పదవికి నామినేషన్లు

**నవతెలంగాణ-ఆర్మూర్**
బార్ అసోసియేషన్ న్యాయవాదుల ఎన్నికల్లో భాగంగా మంగళవారం అధ్యక్ష పదవికి చిలుక సుభాష్, సంయుక్త కార్యదర్శిగా మద్దుల గంగారాం నామినేషన్లు వేసినట్టు ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, తాళ్ల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణ పండిత్, ఎం.కె నరేందర్, చిన్నారెడ్డి, కృష్ణంరాజు, జక్కుల శ్రీధర్, వెంకటేశ్వర్, జగన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఒకరు గైర్హాజరు

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**
మండలంలోని నాలుగు సెంటర్లలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించగా ఒకరు ఆబ్సెంట్ అయినట్టు ఇన్చార్జి ఎంఈఓ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. మండలంలోని అర్గుల్ జక్రాన్‌పల్లి పడకల్ తొర్లికొండ గ్రామాల్లో పదవ తరగతి పరీక్షల నిర్వహించారు. తొర్లికొండ సెంటర్లో ఒకరు ఆబ్సెంట్ అయినట్టు తెలిపారు.

## 26 నుండి బిపిఎడ్ పరీక్షలు

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**
తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బిపిఎడ్ మొదటి, మూడవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ఈనెల 26 నుండి ప్రారంభమై 30 వరకు జరుగుతాయని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షలు నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్.ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైం టేబుల్ వివరాల కోసం ఞఞ.వశ్రీఖఅస్త్రుఋఖబఅఱజవతీంట.ఎ.ఖఎ.ఱఅ ను సంప్రదించాలని పేర్కొన్నారు.

## తైబజార్ వేలం వాయిదా

**నవతెలంగాణ-భీంగల్**
భీంగల్ మున్సిపల్ చైర్మన్ కన్నె ప్రేమలత ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన తైబజారు వేలం వాయిదా పడింది. ఈ తై బజారు వేలానికి ఒక్కరే రావడంతో వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ రామకృష్ణ తెలిపారు. ఈనెల 22న నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన ఆలయ చైర్మన్


ఎమ్మెల్యేను సన్మానించి బొకే అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**
నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మండలంలోని తొర్లికొండ శిలాతీర్థ శ్రీ వెంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కాటిపల్లి సాయిరెడ్డి మంగళవారం పూలబొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఉత్కం శ్రీనివాస్ గౌడ్ తొర్లికొండ గ్రామ సెక్రెటరీ కూడల వినోద్, మండల యువజన విభాగం అధ్యక్షులు సొప్పరి వినోద్, మునిపల్లి మాజీ సర్పంచ్ చిన్న సాయిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## హస్తం గూటికి పలువురు సర్పంచులు


కాంగ్రెస్‌లో పలువురు చేరిక

**నవతెలంగాణ-ఆర్మూర్**
పట్టణంలోని బీఆర్ఎస్ కోట ఖాళీ అవుతుంది. తాజాగా మండలంలోని పలువురు సర్పంచులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని కోమన్‌పల్లి గ్రామ సర్పంచ్ నీరడి రాజేశ్వర్, మగ్గిడి సర్పంచ్ సుమలత నర్సయ్య, సుర్బిర్యాల్ సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్, ఖానాపూర్ సర్పంచ్ సింగిరెడ్డి మోహన్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

## భారీగా మద్యం స్వాధీనం



మక్లూర్ : మద్యంను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్

**నవతెలంగాణ-మాక్లూర్**
మండలంలోని కొత్తపల్లి బెల్ట్ షాప్ పై మంగళవారం టాస్క్ ఫోర్స్ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో బెల్ట్ షాప్ లో 123.250 లీటర్ల (30,210 రూపాయల విలువ) లిక్కర్ ను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్య నిమిత్తం మాక్లూర్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. గుత్పగ్రామంలో 47.750లీటర్ల లిక్కర్‌ను పట్టుకున్నారు. దీనివిలువ రూ. 11580 ఉటుందని తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ అంజయ్య, సిబ్బంది లక్ష్మన్న, సుదర్శన్, రాములు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

**25 మద్యం బాటిళ్లు స్వాధీనం**
**రెంజల్ :** మండలంలోని కళ్యాపూర్ రోడ్డు పక్కన గల కూల్ షాప్‌లో 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఈ. సాయన్న పేర్కొన్నారు. పక్కా సమాచారం మేరకు మంగళవారం షాప్ పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. 25 మద్యం బాటిల్ స్వాధీనం చేసుకొని నిర్వాహకుడు కృష్ణపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

# ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- స్ట్రాంగ్‌రూంలను పరిశీలించిన సీపీ, కలెక్టర్

**నవతెలంగాణ-ఆర్మూర్**
రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా గట్టి భద్రత చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సిపి కల్మేశ్వర్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర పర్యవేక్షణ కోసం సిసి కెమెరాలు, తాగునీరు, విద్యుత్, ఫైర్ అలారమ్స్ ఇతర అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ హాల్లో వాటర్ లీకేజీలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కౌంటింగ్ హాలుతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించాలని ఎక్కడ చెత్తాచెదారం ఉండకూడదని సూచించారు. అవసరమైన మరమ్మత్తు పనులను వేగవంతంగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజనల్ అధికారి రాజా గౌడ్, ఏసీపి బస్వారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు, డిఈ భూమేశ్వర్, తహసిల్దార్ గజానను, అధికారులు పాల్గొన్నారు.

**భీంగల్:** పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ సజావుగా నిర్వహించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల సామాగ్రిని భద్రపరిచే గదులను సిపి కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ అనంతరం ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటుతోపాటు కావలసిన వసతులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.


ఆర్మూర్ :స్రాంగ్‌రూంలను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

అనంతరం పట్టణ కేంద్రంలోని బడా భీంగల్ చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్‌లో సిబ్బందిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఏసిపి బసవ రెడ్డి, ఆర్డీవో, తహసిల్దార్ శ్రీలత, ఎంపీడీవో సంతోష్ కుమార్, మండల అధికారులు ఉన్నారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఐఏఎస్ ట్రైనీ అధికారి రుక్మాయి

**నవతెలంగాణ-ఎడపల్లి**
గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో, ఆసుపత్రి సబ్ సెంటర్లో, ఆరోగ్య మహిళా సంఘాలకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను మంగళవారం శిక్షణ ఐఏఎస్ అధికారిని డాక్టర్ కిరణ్మయి పరిశీలించారు. మండలంలోని జైతాపూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధన అంశాల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు మరుగుదొడ్ల వివరాలను ఆరా తీశారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల్లో బోధన అంశాలు సక్రమంగా లేకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. గ్రామంలోని మహిళా సంఘాలకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలు, వాటిని సద్వినియోగం చేసుకుంటున్న తీరుపై వివరాలు సేకరించారు. మహిళా సంఘాలవారు చేస్తున్న జ్యూట్ బ్యాగుల తయారీపై అభినందించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, పిల్లలు, బాలింతలకు అందజేస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేలాగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె


జ్యూట్ బ్యాగును అందజేస్తున్న అధికారి

విజ్ఞప్తి చేశారు. అధికారుల పని తీరుతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలను ఆమె స్వయంగా చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.
ఆమె వెంట ఎంపీడీవో గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నగేష్, జైతాపూర్ సింగిల్ విండో అధ్యక్షుడు కరటూరి సత్యనారాయణ చౌదరి, మాజీ ఎంపీటీసీ సభ్యులు సూరిబాబు, రైతులు కరటూరి సూర్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆడపిల్లలను చదివించాలి : సీడీపీవో


మాట్లాడుతున్న సీడీపీవో జానకి

**నవతెలంగాణ-బోధన్**
బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళ శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం పరిధిలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంపై డిగ్రీ కళాశాల, బోధన్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ జానకి మాట్లాడుతూ ఐసిడిఎస్ ఆడపిల్లల ఎదుగుదలకు, బాలిక విద్యకోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఆడపిల్లల సంరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం మహిళా సాధికారత కేంద్ర జిల్లా మిషన్ సమన్వయకర్త పి. స్వప్న మాట్లాడుతూ బాలిక లింగ నిష్పత్తి పెంచేందుకు, బాల్యవివాహాల అరికట్టడానికి ప్రభుత్వం చేపట్టిన పథకాలను, చట్టాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా గ్రామాలలో ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ప్రసాద్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధిక, డిహెచ్. ఈడబ్ల్యూఎస్ ఎఫ్ ఎల్ పుష్ప, అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు.

# స్త్రీలు ఆర్థిక పరిపుష్టి కలిగి ఉండాలి

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**
తెలంగాణ యూనివర్సిటీలో మంగళవారం కంప్యూటర్ సైన్స్ కళాశాల సెమినార్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉమెన్ సెల్ డైరెక్టర్ డాక్టర్. ఎం.భ్రమరాంబిక అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ లావణ్య, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (సిఐడి) హైదరాబాద్ హాజరై మహిళలందరూ వర్తమాన సమాజం పట్ల, సాంకేతిక సమస్యల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. స్త్రీలందరూ ఆర్థిక పరిపుష్టి కలిగి ఉండాలన్నారు. ఆర్థిక పరిపుష్టితోనే స్త్రీలకు స్వేచ్ఛ ఉంటుందని, ఉద్యోగ, ఉపాధిలో స్థిరపడాలని పేర్కొన్నారు. నేటికీ భారతదేశంలో మహిళలకు అన్ని రంగాల్లో విశిష్టమైన గుర్తింపు ఉందని, వ్యాపారం, రాజకీయం, విద్య, వైద్య రంగాల్లో దూసుకుపోతున్నారని తెలిపారు. అయినప్పటికీ నేటికీ ఆధునిక యుగంలో సగటు మహిళలు అనేక ఆటుపోట్లు ఎదురుకోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథులుగా



బహుమతులు అందజేస్తున్న అతిథులు

తెలంగాణ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి, ప్రొఫెసర్ డాక్టర్ నసీం, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్. ఆరతి హాజరయ్యారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన ఆట పోటీల్లో గెలుపొందిన బోధన, బోధనేతర మహిళ సిబ్బందికి విద్యార్థినిలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉమెన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ భ్రమరాంబిక అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు.

## గాలికుంటు నివారణ టీకాలు



**నవతెలంగాణ-నందిపేట్**
మండలంలోని షాపూర్ గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను మంగళవారం పశువులకు వేశారు. సుమారుగా 295 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు . కార్యక్రమంలో సహాయ సంచాలకులు బాలికమ్మద్, అశోక్, పశు వైద్య సిబ్బంది సరళ రాణి, విజయ, స్వప్న, శ్యామల, సత్యం, విజయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన

- శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సూచనలు
- రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్

**నవతెలంగాణ-ముప్కాల్**
'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా రైతు వేదికల నుంచి స్థానిక రైతులతో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు నేరుగా మాట్లాడే కార్యక్రమంను మంగళవారం ముప్కాల్ రైతు వేదికలో ప్రారంభించినట్టు మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వరి పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ యాజమాన్య పద్ధతుల గురించి డాక్టర్ బి.శ్రీనివాస్ ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్రవేత్త రైతులకు వివరించారు. అనంతరం రైతుల సందేహాలను సైతం తెలుసుకొని నివృత్తి చేశారు. ఆయిల్ ఫామ్ సాగులో మెళకువలను డాక్టర్ రాజశేఖర్ డీన్ ఆఫ్ హార్టికల్చర్ వివరించారు. వేసవిలో వివిధ కూరగాయ పంటల్లో వాడే పురుగు మందుల వివరాలను డాక్టర్ కె.కవిత ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎంటామాలజీ వివరించి రైతుల యొక్క సందేహాలను నివృత్తి చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా క్షేత్ర స్థాయిలో సాగు సమస్యలని శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలు పొందేదుకు ఉపయోగంగా ఉన్నాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భీంగల్ ఏడీఏ మల్లయ్య, మండల వ్యవసాయ అధికారులు రాజ్ కుమార్, మహేందర్ రెడ్డి, మాలిక్, లావణ్య, ఏఈవో లు నిషికాంత్, అరుణ, రైతులు పాల్గొన్నారు.


వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు, పాల్గొన్న రైతులు

# సహకార సంఘాలపై అవగాహన


సహకార సంఘం చైర్మన్‌లకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డిప్యూటీ రిజిస్టర్ సంగీత

**నవతెలంగాణ-నందిపేట్**
తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం సహకార సంఘాల చైర్మన్లకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. సహకార సంఘాల చట్టం 1964 యొక్క ముఖ్యాంశాలు, నియమాలపై సహకార విద్య -శిక్షణ సంస్థ తరగుతులను నిర్వహించింది. ఈ సందర్భంగా సొసైటీలను ఏవిధంగా నడపాలి.. నూతన సభ్యత్వాలను ఎలా చేసుకోవాలి.. సహకార చట్టం ఏవిధంగా వినియోగించుకోవాలని వివరించారని తెలిపారు. తదుపరి సహకార సంఘం చైర్మన్లకు సర్టిఫికెట్లను స్టేట్ కోపరేటివ్ యూనియన్ హైదరాబాద్ డిప్యూటీ రిజిస్టర్ సంగీత అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా సహకార సంఘాల అధ్యక్షులు బినోల సొసైటి చైర్మన్ మగ్గరి హన్మండ్లు, చింరాజ్ పల్లి సొసైటి చైర్మెన్ బొంకం గంగారెడ్డి, డొంకేశ్వర్ సొసైటి చైర్మన్ భరత్ రెడ్డి పాల్గొన్నారు.

5

# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

## నిజామాబాద్-కామారెడ్డి

బుధవారం | మార్చి 20, 2024 | www.navatelangana.com


### పోషకాహార వారోత్సవాలు

నవతెలంగాణ-ముప్కాల్



పోషకాహార వారోత్సవాల సందర్భంగా మంగళవారం ముప్కాల్ (సెక్టార్) మండల కేంద్రంలోని అంగన్ వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు పోషకాహారంపై ఏసీడీపీఓ జ్యోతి పలుసూచనలు అందజేశారు. అనంతరం గర్భిణులతో పోషకాహారంపై ప్రతిజ్ఞ చేయించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు పూర్తి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి, ఏఎన్ఎం పద్మ, అంగన్ వాడి టీచర్లు అమినా బేగం, వాణి, వరలక్ష్మీ, విజయ, గంగాజమున, తదితరులు పాల్గొన్నారు..

### జగన్నాథుడి వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



మండలంలోని చవణి తండాలో మంగళవారం నాడు జగన్నాథ స్వామి మందిరం వార్షికోత్సవం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు మందిరానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణలో చిన్న పెద్ద తేడా లేకుండా మహిళలు పురుషులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మంగల్ చంద్ మహరాజ్ ,ఆలయ పూజరి సూరజ్ మహరాజ్, మాత పెద్దలు నాయక్ లు కరోభారీలు భక్తులు పాల్గొన్నారు.

# వాడిపోతున్న మొక్కలు

- నర్సరీల వైపు కన్నెత్తి చూడని అధికారులు
- కోట్ల రూపాయలు వృథా
- హరితలక్ష్యం నెరవేరేనా..?

నవతెలంగాణ-లింగంపేట్

పర్యావరణ పరిరక్షణలో భాగంగా గత ప్రభుత్వం ప్రతి హరితహారం పథకం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని అట్టాసంగా ఏర్పాటు చేసేది. హరితహారం కార్యక్రమంలో అధికారులతో పాటు ప్రజా బాధితులు అన్ని శాఖలకు చెందిన అధికారులను భాగస్వామ్యం చేశారు. గత సంవత్సరం నాటిన మొక్కలు రక్షణ కోసం నీరు పోసే దిక్కేలేకపోవడంతో హరితహారం అభాసుపాలవుతుంది. ప్రతి శుక్రవారం వాటర్ డేగా ప్రకటించి నాటిన మొక్కలకునీళ్లు పోసేవారు. ప్రస్తుతం ఆ నిబంధనలు గాలికి వదిలేశారు. దీంతో హరిత తెలంగాణ కోసం వెచ్చించిన కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. వాడిపోతున్న మొక్కలను ఆయా శాఖలకు చెందిన అధికారులు సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటం లేదు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు మొక్కలు. నాటాలి పర్యావరణాన్ని కాపాడాలి అనే నినాదాలతో హరితహారం కింద ప్రతేడాది జూన్ మాసంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గతంలో పెద్దఎత్తున నిర్వహించేవారు. మొక్కలు పెంచేందుకు సైతం ప్రతి గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను సిద్ధం చేసి వర్షాకాలం ప్రారంభంలో నాటేవారు. ఇందుకోసం ప్రతిసారి ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తుండే. ఆయా శాఖలకు చెందిన అధికారులు ప్రజా ప్రతినిధులు పోటీపడి గత సంవత్సరం మొక్కలు నాటి ఫోటోలకు ఫోజులు ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నారు. ప్రస్తుతం వాడిపోతున్న మొక్కలను చూసి ఒకవైపు ప్రజాప్రతినిధులు మరోవైపు అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. గత ప్రభుత్వ లక్ష్యం పూర్తిగా నీరు గారి పోయింది. హరితహారం అభాసు పాలైంది.



రోడ్డు పక్కన ఎండిపోయిన మొక్కలు

**నిధులు లేవు నిర్వాహణ లేదు**

జిల్లావ్యాప్తంగా 526 గ్రామ పంచాయతీల పరిధిలో గత ఏడాది హరితహారం కింద 27 లక్షల నలభై నాలుగు వేల మొక్కలను నాటారు. అందుకుగాను 15వ ఆర్థిక సంఘం నుండి నిధులు సకాలంలో మంజూరు కాకపోవడంతో మల్టీ పర్పస్ వర్కర్లు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం, ట్రాక్టర్లు కిస్తీలు, డీజిల్ డబ్బులు లేకపోవడంతో సంబంధిత గ్రామపంచాయతీలు చేతులెత్తేశాయి. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండగా పట్టించుకునే నాధుడు కరువయ్యాడు.

**కరమైన రక్షణ.. వాడిపోతున్న మొక్కలు**

జిల్లాలో ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ డివిజన్లో పరిధిలో రోడ్డు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ కింద గత సంవత్సరం పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి రోడ్డు ఇరుపక్కల 300 కిలోమీటర్ల పరిధిలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల వెంట ఒక్క లక్ష 41 వేల మొక్కలను నాటారు. వాటి పెంపకం పంచాయతీరాజ్, అటవీశాఖ మున్సిపల్ శాఖలు చేపట్టాల్సి ఉంది. రహదారుల వెంట నాటిన మొక్కలు సంరక్షణ కోసం అవసరమైన కంచెలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కంచెలు, మొక్కలు కనిపించకుండా పోయాయి. నాటిన మొక్కలకు సకాలంలో నీళ్లు పోయకపోవడంతో పూర్తిగా ఎండిపోతున్నాయి. జిల్లాలోని గాంధారి, బాన్సువాడ, లింగంపేట్, మాచారెడ్డి, ఎల్లారెడ్డి, సదాశివ నగర్, దోమకొండ, జుక్కల్, పిట్లం, మద్నూర్, బిచ్కుంద, తాడ్వాయి, రామారెడ్డి, రాజంపేట తో పాటు ఆయా మండలాల్లో రోడ్డు కిరువైపులా మొక్కలు, కంచెలు లేవు. మొక్కలు కనిపించకుండా పోతున్నాయి. లక్షలాది రూపాయలు వృథా అవుతున్నాయి. అదేవిధంగా ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో రెండు లక్షలా 93 వేల మొక్కలను నాటారు. వాటి సంరక్షించే నాధుడు కరువయ్యాడు.

**హరితహారం అభాసుపాలు**

గత ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటుచేసిన హరితహారం కార్యక్రమం అభాసుపాలైంది లక్ష్యం పూర్తిగా నెరవేరకుండా పోయింది. ప్రతి శుక్రవారం ఆయా శాఖలకు చెందిన అధికారులు వాటర్ డే నిర్వహించి నీరు పోసేవాళ్ళు, ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలనలో అది కూడా మరిచిపోయారు. గతంలో హరితహారంలో నాటిన మొక్కలను పశువులు మేకలు పాడుచేసిన జరిమానాల విధించేవారు.

**ఆయా శాఖలే బాధ్యత వహించాలి**

**చందర్ నాయక్ పీడీ**

రోడ్డు కిరువైపులా, ప్రభుత్వ కార్యాల వద్ద నాటిన మొక్కల రక్షణ సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని అన్నారు. గత సంవత్సరం హరితహారంలో నాటిన మొక్కల బాధ్యత సంబంధిత అధికారులకు అప్పగించాము. వారే బాధ్యత వహించాలని ఆయన సూచించారు. నీరు పోసి వాటిని కాపాడాలన్నారు.



ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న రెండు బైక్‌లు

### రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-బాల్కొండ

రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని వన్నెల్(బి) గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై కే గోపి వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి వన్నెల్ (బి) గ్రామ శివారులోని బ్రిడ్జి పైన ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆదిలాబాద్ జిల్లా దొంగార్గోన్ గ్రామానికి చెందిన జి. ఉద్దేవ్ (45) అక్కడికక్కడే మృతి చెందాడు. ఉద్దేవ్ ముప్కాల్ గ్రామంలో నివసిస్తూ టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన పతాని రిషికి తీవ్ర గాయాలయ్యాయి.

### వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డికి చెందిన వ్యక్తి ఆరోగ్యం బాగాలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి వివరాల ప్రకారం... కామారెడ్డి హరిజన వాడలో నివాసం ఉండే బానవత్ మహేష్(40) సొంతూరు మాచారెడ్డి మండలం సరదాపూర్ తండా. 20 సంవత్సరాల కిందట బానోతు నీలతో వివాహమైనది. తర్వాత 15 సంవత్సరాల కిందట హరిజన వాడకి చెందిన గీత అనే ఆమెతో పరిచయం ఏర్పడి ప్రస్తుతం ఆమెతో సహజీవనం చేస్తూ కామరెడ్డిలోనే ఉంటున్నాడు. మద్యం తాగడంవల్ల లివర్ ప్రాబ్లం ఏర్పడింది. మంగళవారం మహేష్ ఇంట్లో ఎవరూలేని సమయంలో బెడ్ రూమ్ లో ఫ్యానుకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి బానోతు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

### కరాటే పోటీలో విజేతలకు సన్మానం



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని వసుధ పాఠశాల విద్యార్థులు జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్గొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన పసుల గౌతం, సిల్వర్ మెడల్ సాధించిన కొర్వ శ్రీవాత్సలకు పాఠశాల ప్రిన్సిపాల్ న్యాలకంటి శంకర్ మంగళవారం ప్రశంసా పత్రం మెడల్, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శంకర్ మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రస్తుత కాలంలో ఆడపిల్లలకు రక్షణ కరువైనందున ఆడపిల్లలు కచ్చితంగా కరాటే శిక్షణ తీసుకోవాలని సూచించారు. గోల్డ్ మెడల్ సాధించిన ఆరవ తరగతి విద్యార్థి గౌతమ్ జాతీయస్థాయిలో సైతం పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరాటే టీచర్ బిందును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గంగా ప్రసాద్, ఉపాధ్యాయులు సుజాత, నీల తదితరులు ఉన్నారు.

## తరచూ మొరాయిస్తున్న సిగ్నల్స్

- ఇబ్బందుల్లో వాహనదారులు




నవతెలంగాణ ఆర్మూర్

పట్టణంలో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు రోజు రోజుకు ఎక్కువవుతున్నాయి. కొన్ని రోజుల నుండి మామిడిపల్లి చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో వాహనదారులు, పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైన వేళ పరీక్ష సెంటర్లకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, 63వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న వివిధ చౌరస్తాల్లో రూ.13 లక్షలతో సిగ్నల్స్ వ్యవస్థను గతంలో ఏర్పాటు చేశారు. నిర్వహణ, మరమ్మత్తుల విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంబేద్కర్ చౌరస్తా, బస్టాండ్, హౌసింగ్ బోర్డ్ వెళ్లే దారి, మామిడిపల్లి చౌరస్తా,, గోవింద్‌పేట్,, పెర్కిట్ కూడళ్లలో సమస్య తీవ్రంగా ఉంది.

**రోడ్లపైనే వాహనాల పార్కింగ్..**

చిరు వ్యాపారులు తోపుడు బండ్లవారు, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తుండడంతో వాహనాలు నిలపడానికి సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా రహదారిపైనే వాహనాలను నిలిపి ఉంచడం వల్ల ట్రాఫిక్ ఏర్పడడానికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది. ఇతర మండలాల నుండి, చుట్టుపక్కల గ్రామాల నుండి వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చేవారు దుకాణాల ఎదుట వాహనాలను నిలిపి పనులు ముగించుకొని వెళ్తున్నారు. అతికొద్ది సమయంలోనే వాహనాల సంఖ్య పెరిగి సగం రోడ్డును ఆక్రమిస్తున్నాయి. దీంతో పెద్దపెద్ద వాహనాలు, ఆర్టీసీ బస్సులు, కార్లు వచ్చినప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. దీనికి తోడుగా సిగ్నల్స్ వ్యవస్థ లేక వాహనదారులు ఇష్టారీతిన వెళ్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వచ్చినప్పుడే ట్రాఫిక్ కట్టడికి చర్యలు తీసుకుంటున్నారని విమర్శలు వెల్లివెత్తుతున్నాయి.

**చర్యలు తీసుకుంటాం...**



పట్టణంలో పలుచోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.. వాహన దారులు నిబంధనలను పాటిస్తూ ప్రయాణాలు చేయాలి.

**రవికుమార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఆర్మూర్**

### గ్రంథాలయానికి పోటెత్తుతున్న అభ్యర్థులు

- పరీక్షలకు సన్నద్ధం అవుతున్న యువకులు

నవతెలంగాణ-ఆర్మూర్



గ్రంథాలయం పైన స్లాబ్ నిర్మాణ పనులు

పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో గల గ్రంథాలయానికి ఉద్యోగార్థులు పోటెత్తుతున్నారు. వరుస ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడుతున్న తరుణంలో పట్టణంతో పాటు పెర్కిట్, మామిడిపల్లిలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి చదువుకునేందుకు ప్రతిరోజు 100 మందికిపైగా అభ్యర్థులు వస్తున్నారు. స్థలాభావం కారణంగా ఇక్కట్లు పడుతున్నారు. గత కొన్ని నెలల నుండి ఇక్కడకు వస్తున్న వారి సంఖ్య 175కు పెరిగింది. పుస్తకాలు అందుబాటులో ఉన్న చదువుకునేందుకు గదులు మూత్రశాలలు లేవని వాపోతున్నారు. ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 వరకు ఇక్కడే ఉండి పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు చెబుతున్నారు. గ్రంథాలయానికి వచ్చేవారి సంఖ్య పెరగడంతో ఇక్కడ ఉన్నటువంటి అన్ని గదులను అందుబాటులోకి తీసుకొచ్చారు. పుస్తకాలకు ఒక హాలు ఉండగాచదువుకునేందుకు పెద్ద హాలు, రెండు చిన్న గదులు గ్రంథ పాలకురాలి గదిని కూడా అభ్యర్థులు ఉపయోగించుకుంటున్నారు..

**మొదటి అంతస్తు నిర్మాణం...**

గ్రంథాలయానికి వచ్చే వారి సంఖ్య రోజుకు పెరగడంతో ఇక్కడ ఉన్న ఇబ్బందులను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా పైఅంతస్తు నిర్మాణ పనులు నడుస్తున్నాయి.

**వరలక్ష్మి, గ్రంథ పాలకురాలు. ఆర్మూర్**

### క్విజ్ పోటీల్లో ఆర్కిడ్స్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి

రోడ్డు భద్రత రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్కిడ్స్ పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం అభినందనీయమని కామారెడ్డి రోడ్డు రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఓహెచ్‌ఎస్‌సాయి ఇన్ అసోసియేషన్ విత్ ఇండియా డెవలప్మెంట్ ఫౌండేషన రోడ్డు భద్రతపై ఆన్‌లైన్ ద్వారా పోటీలను ఫిబ్రవరి 4 న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించినట్టు పాఠశాల చైర్మన్ ప్రిన్సిపల్ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. క్విజ్ పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి రోడ్డు రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి హాజరై అభినందించారు. తొమ్మిదవ తరగతి విద్యార్థులు అక్షిత రాష్ట్రస్థాయిలో 74 ర్యాంక్, సహిన్ 75 వ ర్యాంక్, అభిలాస్ 98 ర్యాంక్, సాయిమనీష్ 167 ర్యాంక్, నిత్యశ్రీ 8వ తరగతి విద్యార్థి 104 ర్యాంక్, ఏడవ తరగతి విద్యార్థి భవిత 129 వ ర్యాంక్, ఏడవ తరగతి విద్యార్థి మోక్ష 141 ర్యాంక్, ఏడవ తరగతి విద్యార్థి వర్షిత 148వ ర్యాంక్, ఆరవ తరగతి విద్యార్థి శశాంక్ 176 ర్యాంకులు సాధించిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కే గ్రూప్స్ చైర్మెన్ జైపాల్ రెడ్డి, సదాశివరెడ్డి, రిటైర్డ్ ఎంపీడీవో విట్టల్ రావు, శ్రీధర్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆకుకూరలు, చిరుధాన్యాలు తీసుకోవాలి

- ఐసీడీఎస్ ఏసీడీపీఓ జ్ఞానేశ్వరి
- పోషణ పక్వాడా కార్యక్రమం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భీంగల్ ఐసిడిఎస్ ఏసిడిపిఓ జ్ఞానేశ్వరి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు ఆకుకూరలు, చిరుధాన్యాలు తీసుకోవాలని అన్నారు. వీటివల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో లభించే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా పిల్లలు శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. పోషణ్ అభియాన్ అధికారి రాంబాబు పోషకాహారం పై పలు సలహాలు సూచనలు తెలిపారు. అనంతరం పోషణ పక్వాడ్ జనాందోళన డ్యాష్ బోర్డులో కార్యక్రమాల ఫోటోలను అప్లోడ్ చేయడంపై అంగన్వాడీ టీచర్లకు శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ మండల పర్యవేక్షకురాలు సరస్వతి, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎం లు, తల్లులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో..



ఆర్మూర్ : పెర్కిట్‌లో..

**వర్ని:** మండలంలోని జాకోరా అంగన్ వాడి సెంటర్లో మంగళవారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా పోషకాహారంపై చిన్న పిల్లల తల్లులందరికీ పౌష్టిక ఆహారంపై సూపర్ వైజర్ మమత అవగాహన కల్పించారు. తదుపరి ఏడు నెలల పిల్లలకి అన్నప్రాసన చేయించారు. పుట్టిన బిడ్డకు తల్లి, ముర్రుపాలు పట్టాలని, ఆ పాలు పట్టడంతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్స్ స్వర్ణ లత, తల్లులు పాల్గొన్నారు.

**ఆర్మూర్:** మునిసిపల్ పరిధిలోని పెర్కిట్ అంగన్వాడి కేంద్రంలో మంగళవారం పోషణ పక్షోత్సవాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గర్భిణి స్త్రీలకు సీమంతాలు, ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన ,అక్షరాభ్యాసం, తల్లిపాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు నిత్యం జీవితంలో ఒక భాగం కావాలని, పోషకాలతో కూడిన వంటకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏసిడిపిఓ జ్యోతి, అంగన్వాడి టీఎన్జీవో జిల్లా అధ్యక్షురాలు తార, సూపర్వైజర్ శ్రీదేవి, టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రుల ు పాల్గొన్నారు.

### ఇద్దరు బాలికల అదృశ్యం

**కేసు నమోదు**

నవతెలంగాణ కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు బాలికలు అదృశ్యమైనట్లు కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రవీణ్ మంగళవారం తెలిపారు. మూడో టౌన్ పరిధిలో నివాసం ఉండే 9, 10వ తరగతి చదివే ఇద్దరు విద్యార్థినులు పెద్దలు మందలించడంతో తమ ఇళ్ల నుంచి బయటకు వెళ్లిపోయారని సమాచారం. అనంతరం కుటుంబీకులు వారి ఆచూకీ కోసం గాలించారు. ఎలాంటి సమాచారం లేకపోగా మూడో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్య కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇద్దరు బాలికల అదృశ్యం తమ పరిధిలోని పోలీసు సిబ్బందితోపాటు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే చర్యలు చేపట్టినట్లు తెలిసింది.

### మల్లుస్వరాజ్యం ఆశయ సాధనకు కృషి చేస్తాం

నవతెలంగాణ-కంఠేశ్వర్



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఆఫీసులో ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ మల్లుస్వరాజ్యం భూస్వాముల గుండెల్లో బుగులు పుట్టేలా తుపాకీ చేత బట్టి ఎంతోమంది నిరుపేదలకు అండగా నిలిచి అట్టడుగు కులాలకు నేనున్నానని భరోసానిచ్చారని తెలిపారు. పోరాటం చేసి ఆదర్శంగా నిలిచి ఎంతో మంది మహిళలని చైతన్యవంతం చేసిన చరిత్ర మల్లు స్వరాజ్యంకు ఉందన్నారు. ఆమె స్ఫూర్తితోనే పోరాటంలోకి అడుగుపెట్టామని, ఇప్పటికీ ఇంకా కొనసాగడానికి ఆదర్శం మల్లు స్వరాజ్యం ఆమె ఆశయాల కోసంమని అన్నారు. ఊపిరి ఉన్నంతవరకు పోరాటాలు కొనసాగిస్తామని ఆమె కోరుకున్న సమాజ మార్పు కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు. కళావతి, లక్ష్మి, అనిత, తదితరులు పాల్గొన్నారు

### నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-రామారెడ్డి

నేడు మండల సర్వసభ్య సమావేశం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సవిత రెడ్డి ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని, డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

### అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-రామారెడ్డి

అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పల్వాయి గ్రామానికి చెందిన ఆకుల లింగం (46) బ్రెన్ స్ట్రోక్ రావడంతో, గత కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ, నడవడానికి ఇబ్బందిగా ఉండటంతో ఇంటికే పరిమితమైయ్యాడు. జీవితంపై విరక్తి చెంది పశువుల కొట్టంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య ఆకుల పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏ ఎస్ ఐ రవీందర్ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.